సాక్షి
నిజామాబాద్
శనివారం। 1। మార్చి। 2025



అజ్ఞాతంలో ఐదుగురు!
ఉమ్మడి జిల్లాలో మావోయిస్టు పార్టీకి ఉనికి లేకపోయినా పలువురు ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.
- 8లో ▸



జాతీయ సైన్స్ దినోత్సవం
జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
35.5 /18.9
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు బాబ్లీ గేట్ల ఎత్తివేత

- దిగువకు 0.6 టీఎంసీల నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం శనివారం ఎత్తనున్నారు. సుప్రీం ఆదేశాల మేరకు బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను ప్రతి సంవత్సరం జూలై 1న ఎత్తి అక్టోబర్ 28న మూసివేయాలి. అనంతరం ఎగువ ప్రాంతాల్లోని అక్కడక్కడా గుంతల్లో నిలిచిన నీటికి బదులుగా 0.6 టీఎంసీల నీటిని మార్చి 1న బాబ్లీ నుంచి ఎస్సారెస్పీకి వదలాలని సుప్రీం కోర్టు తీర్పులో పేర్కొంది. ఆ తీర్పు ప్రకారం బాబ్లీ గేట్లు తెరిచి 0.6 టీఎంసీల నీటిని దిగువకు వదులుతారు. దీంతో ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతంలో గోదావరికి జలకళ రానుండగా, ప్రాజెక్టులోకి అంతగా నీరు వచ్చే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తుతం బాబ్లీ ప్రాజెక్టులో కొంతమేర నీరుంది. ఏటా మార్చి 1న గేట్లు ఎత్తితే 0.2 టీఎంసీల నీరు మాత్రమే వచ్చి చేరుతుంది. కాగా, 0.6 టీఎంసీల కోటా పూర్తికాగానే గేట్లను మూసివేయనున్నారు. నీటి విడుదల పర్యవేక్షణలో ఎస్సారెస్పీ తరఫున ఈఈ చక్రపాణి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

ఖలీల్‌వాడి: ఈ నెల 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ 163 సెక్షన్ అమలులో ఉంటుందని ఇన్‌చార్జి సీపీ సింధు శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష సెంటర్ నుంచి 100 మీటర్ల మేర ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద షాపులు మూసివేయాలని పేర్కొన్నారు.

జాతీయ పసుపు బోర్డు కార్యదర్శిగా భవానిశ్రీ



సుభాష్‌నగర్: జాతీయ పసుపు బోర్డు కార్యదర్శిగా ఎస్ భవానిశ్రీని నియమిస్తూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. భవానిశ్రీ 2017వ బ్యాచ్ నాగాలాండ్ రాష్ట్ర కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. భవానిశ్రీ, సుగంధ ద్రవ్యాల బోర్డు డైరెక్టర్ (పరిశోధన) డాక్టర్ ఎబీ రెమాశ్రీ కలిసి సుగంధ ద్రవ్యాల బోర్డు, జాతీయ పసుపు బోర్డు మధ్య కార్యకలాపాలను సమన్వయం చేస్తారు.

నియామకం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్‌గా సువర్ల నియమితులయ్యారు. వీసీ యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి శుక్రవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు సువర్ణలకు ఎడ్యుకేషన్ కాలేజ్ ప్రిన్సిపల్ సాయిలు ఉత్తర్వులను అందజేశారు.



జాడిజమాల్‌పూర్ గ్రామ శివారులోని డీ-28 కాలువకు శుక్రవారం వచ్చిన నీళ్లు

సాలూర మండలం జాడిజమాల్‌పూర్ గ్రామ శివారులో నీళ్లు అందక నెర్రెలుబారిన పొలం



పొలం వద్ద రైతు పూదోట అలెక్స్

నెర్రెలుబారిన చివరాయకట్టు

- ఎండుతున్న పొలాలు
- సాలూర క్యాంప్, ఫత్తేపూర్, జాడిజమాల్‌పూర్ గ్రామాల రైతుల ఆందోళన
- వారం క్రితమే నిజాంసాగర్ నుంచి నీటి విడుదల
- కాలువల్లోకి సమృద్ధిగా రాని నీరు

బోధన్: నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. బోధన్ ఉమ్మడి మండలంలోని డీ-28/14 కాలువ కింద చేతికొచ్చిన పంటలకు నీటి గండం ఏర్పడింది. నీళ్లందక పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డీ-28 కాలువ వర్ని మండలంలోని తగిలేపల్లి గ్రామ శివారులో ప్రారంభమవుతుంది. బోధన్ మండలంలోని పెంటాకుర్దు క్యాంప్ మీదుగా సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్, సాలంపాడ్, కుమ్మన్‌పల్లి, కొప్పర్తి క్యాంప్, సాలూర క్యాంప్, ఫత్తేపూర్, జాడిజమాల్‌పూర్ వరకు కాలువ విస్తరించి ఉంది. కాలువ కింద 11 వేల ఎకరాల ఆయకట్టులో వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న పంటలు చేతికొస్తున్నాయి. ప్రాజెక్టు నుంచి ఫిబ్రవరి 21న నాలుగో విడత నీటి విడుదల ప్రారంభం కాగా, ఇప్పటి వరకు కాలువకు నీళ్లు రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. మరో రెండు రోజుల్లో నీటి సరఫరా గడువు ముగియనుండడంతో ఇంకా పది రోజులపాటు నీటి విడుదల పొడిగించాలని కోరుతున్నారు. కాలువకు 450 క్యూసెక్కుల పరిమాణానికి తగ్గకుండా నీటిని సరఫరా చేస్తేనే పంటలు బతుకుతాయని చెబుతున్నారు. కాగా, రెండ్రోజులుగా 435 క్యూసెక్కుల నీళ్లు వదిలామని అధికారులు చెబుతుండగా, 250 నుంచి 350 క్యూసెక్కులకు మించి కాలువకు నీళ్లు సరఫరా కావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. దీంతో సాలూర క్యాంప్, ఫత్తేపూర్, జాడిజమాల్‌పూర్ గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల పంటలు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాడిజమాల్ గ్రామ శివారులోని సుమారు 500 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలకు నీరందక నేల నెర్రెలు బారడం గమనార్హం.



సాలూర క్యాంప్ జీపీ ఆవరణలో రైతులతో చర్చిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు



సాలూర క్యాంప్ జీపీలో అధికారులను నిర్బంధించిన గదికి తాళం వేస్తున్న రైతులు

అధికారుల నిర్బంధం

సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు నీటిపారుదల శాఖ అధికారులను నిర్బంధించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలై వారం రోజులైనా అధికారుల పర్యవేక్షణ లోపంతో పొలాలకు నీళ్లందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖ డీఈ భూమన్న, ఏఈ సత్యనారాయణ శుక్రవారం సాలూర మండలంలోని సాలూర క్యాంప్ గ్రామ పంచాయతీ ఆఫీసు వద్ద రైతులతో సమావేశమై నీటి సమస్యపై చర్చించారు. అధికారుల రాకను తెలుసుకొని సాలూర క్యాంప్, జాడిజమాల్‌పూర్, ఫత్తేపూర్ గ్రామాల రైతులు తరలివచ్చారు.

అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు పంచాయతీ ఆఫీసులో వారిని నిర్బంధించారు. సమాచారం తెలుసుకున్న ఏఈ శృతి (కాలువ పర్యవేక్షకురాలు), బోధన్ రూరల్ సీఐ విజయబాబు, ఎస్సై మచ్చేందర్ సాలూర క్యాంప్‌నకు చేరుకొని రైతులతో మాట్లాడారు. అనంతరం అధికారులను విడిపించి, రైతులతో కలిసి కాలువలో నీటి పారకం పరిస్థితిని పరిశీలించారు.



నిర్బంధానికి గురైన డీఈ భూమన్న, ఏఈ సత్యనారాయణ

కదిలిన అధికారులు

డీ-28 కాలువలో నీటిపారకం పరిశీలన

సాలూర క్యాంప్, జాడిజమాల్‌పూర్, ఫత్తేపూర్ గ్రామాల రైతుల ఆందోళనకు నీటిపారుదల శాఖ, జిల్లా అధికార యంత్రాంగం కదలింది. శుక్రవారం సాయంత్రం నీటిపారుదల శాఖ నిజామాబాద్ యూనిట్ సీఈ మధుసూదన్‌రావు, ఎస్ఈ బద్రీనారాయణ, డివిజన్ డీఈ భూమన్న, ఏఈలు సత్యనారాయణ, శృతి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయబాబు రైతులతో కలిసి కాలువలో నీటిపారకం పరిస్థితిని పరిశీలించారు.

వర్ని మండలంలోని తగిలేపల్లి గ్రామ శివారులోని డీ-28 మెయిన్ కెనాల్, బోధన్, సాలూర మండలంలోని కాలువ వెంట పర్యటించారు. కాలువపై అనధికారికంగా కొందరు రైతులు ఏర్పాటు చేసుకున్న కరెంట్ మోటార్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. రాత్రి బాన్సువాడ డివిజన్ సీఈ శ్రీనివాస్, ఈఈ రాజశేఖర్ క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అధికారుల వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మందర్న రవి, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, సాలూర క్యాంప్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రావు ఉన్నారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాలతో అధికారులు దిద్దుబాటు చర్యలు ఉపక్రమించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.



వర్ని మండలంలోని తగిలేపల్లి శివారులో నీటి పారకాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

నీరందించేందుకు చర్యలు

డీ-28/14 కాలువ కింద పంటలకు నీళ్లందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కాలువపై కొందరు రైతులు అనధికారికంగా కరెంట్ మోటార్లతో నీటి తరలిస్తున్నారు. దీంతో సమస్య వస్తోంది. పలు కరెంట్ మోటార్లను తొలగించాం. 435 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం.

– భూమన్న, డీఈ, నీటిపారుదల శాఖ

నెలాఖరు వరకు ఓటీఎస్‌కు గడువు

- రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- యూరియాను పొదుపుగా వాడుకోవాలి
- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులోని ఖాతాదారులైన రైతుల సౌకర్యార్థం ఏకకాల పరిష్కార పథకం (ఓటీఎస్)కు ఈ నెల 31 వరకు గడువు ఉన్నట్లు ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి తెలిపారు. నగరంలోని ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండున్నరేళ్లుగా దీర్ఘకాలిక రుణాల చెల్లింపు, కాలపరిమితి ముగిసిన రుణాల చెల్లింపు కోసం డీసీసీబీలో ఓటీఎస్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ స్కీమ్‌లో భాగంగా వాయిదా మీరిన వడ్డీలో 40 శాతం రాయితీ, అపరాధ వడ్డీలో వందశాతం రాయితీ వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సొసైటీల ద్వారా బట్వాడా చేసిన దీర్ఘకాలిక రుణాలు, డీసీసీబీ ద్వారా బట్వాడా చేసిన నాన్ ఫామ్ సెక్టార్, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూప్‌లు, దీర్ఘకాలిక మార్ట్‌గేజ్ రుణాలకు వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సొసైటీ, ఎన్‌డీసీసీబీ శాఖలో సంప్రదించాలన్నారు. ఓటీఎస్‌ను నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని డీసీసీబీ ఖాతాదారులు, సొసైటీ సభ్యులు సద్వినియోగం చేసుకొని రుణ విముక్తులు కావాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

యూరియా కొరత లేదు

జిల్లాలో యూరియా కొరత ఎక్కడా లేదని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చైర్మన్ రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. యూరియాను పొదుపుగా వాడుకోవాలని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ లింగయ్య పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- మాక్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ
- బాలికల మినీ గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్

మాక్లూర్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. మాక్లూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న చికిత్సలు, నిర్వహిస్తున్న రక్త పరీక్షలపై వైద్యుడు సయ్యద్ అజ్మత్ హైమద్‌ను అడిగి తెలుసుకున్నారు. రోజువారీ రిజిస్టర్ తనిఖీ చేసి, పీహెచ్‌సీలో ఉన్న ఔషధాలపై ఆరా తీశారు. ఒక్కోరోజు ఎంతమందికి బీపీ, డయాబెటిక్ పరీక్షలు చేస్తున్నారని వైద్యుడిని అడిగారు. వ్యాక్సినేషన్ గదిని సందర్శించి వ్యాక్సిన్‌లు, స్టోర్ గదిలోని మందుల గడువు తేదీలను పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలను రెండు రోజులకోసారి శుభ్రం చేయించాలని ఎంపీవో శ్రీనివాస్‌ను ఆదేశించారు. అనంతరం ఎలియానాయక్ తండాలో ఉన్న బాలికల మినీ గురుకుల పాఠశాలను సందర్శించారు. వంట గది, భోజనశాలను పరిశీలించి సరుకుల నాణ్యత తెలుసుకున్నారు. నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీచేశారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్ పద్మలత, గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ విద్యారాణి ఉన్నారు.



మాక్లూర్ పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



బాలికల మినీ గురుకులంలో వంట సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాలు
- పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- 57 సెంటర్లు, 36,222 మంది విద్యార్థులు
- 5 నుంచి ఇంటర్ పరీక్షలు షురూ
- 'సాక్షి'తో ఇంటర్ విద్యాధికారి రవికుమార్

'ఇంటర్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తాం. తప్పిదాలకు ఆస్కారం లేకుండా.. సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం.' అని చెబుతున్నారు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్. ఈ నెల 5 నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ వార్షిక పరీక్షలపై శుక్రవారం 'సాక్షి' ఇంటర్వ్యూలో వివరాలు వెల్లడించారు.
– నిజామాబాద్‌అర్బన్



సాక్షి ఇంటర్వ్యూ

ప్రశ్న: పరీక్షల ఏర్పాట్లు ఎంత వరకు వచ్చాయి?

జవాబు: పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం సిబ్బంది, అధికారులకు శిక్షణ ఇస్తున్నాం. ఈ ఏడాది జిల్లాలో 57 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. అన్ని కేంద్రాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించాలని సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశాం.

■ **పరీక్షలు రాసే విద్యార్థులెందరు?**

■ ఈ ఏడాది జిల్లాలో 57 కేంద్రాల్లో 36,222 మంది పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరం జనరల్ 15,053 మంది, ఒకేషనల్ 2,736 మంది, మొత్తం 17,789 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రెండో సంవత్సరంలో జనరల్ రెగ్యులర్ 13,944 మంది, ప్రైవేట్ 2,128 మంది, ఒకేషనల్ 2,042 మంది, ప్రైవేట్‌గా 319 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

■ **ఎంతమంది సిబ్బంది, అధికారులను నియమించారు**

■ 57 పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లను నియమించాం. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 8 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేశాం. వీటితోపాటు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ ముగ్గురు సభ్యులను ఏర్పాటు చేసింది.

■ **'ప్రైవేట్'కు అనుకూలంగా సిబ్బందిని నియమించినట్లు ఆరోపణలు ఉన్నాయి?**

■ పరీక్ష కేంద్రాలు, అధికారులు, సిబ్బందిని రాష్ట్ర ఉన్నతాధికారులు మాత్రమే నియమిస్తారు. మా చేతుల్లో ఏమీ లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లోని విద్యార్థులకు సొంత కళాశాలలో కాకుండా ఇతర సెంటర్లను కేటాయిస్తాం. ఇన్విజిలేటర్లు, సబ్జెక్టు లెక్చరర్లు కూడా వేర్వేరుగా ఉంటారు. అవసరమైన మేరకు మాత్రమే ప్రైవేట్ టీచర్లను కేటాయిస్తాం. ఎక్కడా ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వలేదు.

మాస్‌కాపీయింగ్ నిరోధానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

■ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నాం. ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. ప్రశ్నపత్రాల సరఫరా కూడా సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే కొనసాగుతుంది. ప్రత్యేక బృందాలు ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తాయి. సెంటర్‌లోకి వచ్చే ముందే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తాం.

■ **సెల్‌ఫోన్‌ల అడ్డుకట్టకు తీసుకుంటున్న చర్యలు ఏమిటీ?**

■ పరీక్షల నిర్వహణలో సెల్‌ఫోన్‌ల వ్యవహారం తరచూ వివాదాలకు దారితీస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఇంటర్ పరీక్షలను మరింత లోతుగా పరిశీలన చేసి సెల్‌ఫోన్ల నిషేధం పక్కాగా అమలు చేస్తాం. సెంటర్‌లో ఎవరికీ సెల్‌ఫోన్ వినియోగించే అనుమతి లేదు. దీనిపై పకడ్బందీగా వ్యవహరిస్తాం.

■ **మౌలిక సదుపాయాలు కల్పించారా?**

■ 16 ప్రభుత్వ కళాశాలలు, 2 ఎయిడెడ్, 7 మోడల్ స్కూళ్లు, 26 ప్రైవేట్ కళాశాలలు, 2 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, 2 తెలంగాణ మైనారిటీ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బీసీ వెల్ఫేర్ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశాం. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, బెంచీలు తదితర వసతులు సదుపాయాలు కల్పించాం.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



బోధన్ - నిజామాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న మహిళలు

- సారంగాపూర్‌లో రాస్తారోకో
- నెల రోజులుగా తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని ఆవేదన

నిజామాబాద్ రూరల్: నగరంలోని 13వ డివిజన్ సారంగాపూర్‌లో నీటి కొరత తీర్చాలంటూ మహిళలు రోడ్డెక్కారు. నిజామాబాద్– బోధన్ ప్రధాన రహదారిపై శుక్రవారం ఖాళీ బిందెలు పట్టుకొని రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ నెలరోజులుగా తాగునీటి సరఫరా సరిగా జరగడం లేదని, నీటి సరఫరా చేసే బోరు మోటార్లు తరచూ పాడైపోతున్నాయని పేర్కొన్నారు. తాగునీటి ఇబ్బందులు తీర్చాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందన కరువైందని తెలిపారు. నెలరోజుల క్రితం సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని సారంగాపూర్ వాసి అక్బర్ నవాజుద్దీన్, వడ్డెర కాలనీ వాసి పల్లెపు యాదేశ్ ఆరోపించారు.

రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సారంగాపూర్ చేరుకొని తాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

అజ్ఞాతంలో ఐదుగురు!

■ కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన లోకేటి చందర్‌ అలియాస్‌ స్వామి 1995లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. ప్రస్తుతం దండకారణ్యంలో వెస్ట్‌ సబ్‌ జోనల్‌ బ్యూరో కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అతడిపై రూ.20 లక్షల రివార్డు ఉంది.



■ పాల్వంచ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన ఎర్రగొల్ల రవి అలియాస్‌ దినేశ్‌ 2001 లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఆజాద్‌ ప్రొటెక్షన్‌ టీంలో సభ్యుడిగా పనిచేస్తున్నాడు. ఇతడిపై రూ .5 లక్షల రివార్డు ఉంది.



■ కామారెడ్డి మండలం ఇస్రోజీవాడికి చెందిన లోకేటి రమేశ్‌.. లోకేటి చందర్‌ అలియాస్‌ స్వామి కొడుకు. అతడు తండ్రి బాటలోనే పయనిస్తూ 2009లో విప్లవోద్యమంలో చేరాడు. సౌత్‌ బస్తర్‌లో కొంటా ఏరియా కమిటీ డీసీఎంగా పనిచేస్తున్నాడు. ఇతడిపై రూ.4 లక్షల రివార్డు ఉంది.



■ లోకేటి లావణ్య అలియాస్‌ శాంతి.. లోకేటి చందర్‌ అలియాస్‌ స్వామి కూతురు. ఈమె కూడా 2009 లో అజ్ఞాతంలోకి వెళ్లింది. ఏరియా కమిటీ మెంబర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఈమెపై రూ.4 లక్షల రివార్డు ఉంది.



■ సదాశివనగర్‌ మండలం అడ్లూర్‌ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన లింబయ్యగారి వెంకట్‌ రెడ్డి 1999 నుంచి అజ్ఞాతంలో ఉంటున్నాడు. ఆయన ఎక్కడ పనిచేస్తున్నాడన్నది పోలీసులకు తెలియదు. కాగా అతడిపై లక్ష రూపాయల రివార్డు ఉంది.

కామారెడ్డి జిల్లాలో మావోయిస్టు పార్టీ ఉనికి లేకపోయినా.. ఈ ప్రాంతానికి చెందిన పలువురు మాత్రం ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇస్రోజీవాడికి చెందిన లోకేటి చందర్‌ అలియాస్‌ స్వామితోపాటు అతడి కుమారుడు, కూతురు కూడా దండకారణ్యంలోనే ఉంటూ వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఆరెపల్లికి చెందిన ఎర్రగొల్ల రవి అలియాస్‌ దినేశ్‌తోపాటు అడ్లూర్‌ ఎల్లారెడ్డికి చెందిన లింబయ్యగారి వెంకట్‌రెడ్డి కూడా అజ్ఞాతంలో ఉన్నారు. వీరంతా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసులు సూచిస్తున్నారు.

- దండకారణ్యంలో పనిచేస్తున్న జిల్లా మావోయిస్టులు
- స్వామితో పాటు ఆయన కొడుకు, కూతురుదీ అడవిబాటే
- విప్లవోద్యమంలో ఎర్రగొల్ల రవి, లింబయ్యగారి వెంకట్‌రెడ్డి
- లొంగిపోవాలని సూచిస్తున్న పోలీసులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం : ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో ఒకప్పుడు సీపీఐ(ఎంఎల్‌) పీపుల్స్‌వార్‌ నక్సల్స్‌ కార్యకలాపాలు జోరుగా సాగేవి. కొన్ని ప్రాంతాల్లో సమాంతర పాలన కొనసాగింది. 1990 నుంచి 2000 మధ్య కాలంలో జిల్లాలో ఆ పార్టీ కార్యకలాపాలు జోరుగా సాగాయి. నక్సలైట్‌ ఉద్యమం సీరియస్‌గా కొనసాగిన కాలంలో ఉమ్మడి జిల్లాలో చాలా మంది అజ్ఞాతంలో పనిచేశారు. కామారెడ్డి ఏరియా దళం, ఎల్లారెడ్డి ఏరియా దళం, సిర్నాపల్లి ఏరియా దళం, బాన్సువాడ ఏరియా దళం, సిరిసిల్ల ఏరియా దళాలు పనిచేసేవి. అయితే అప్పటి ప్రభుత్వాలు విధించిన తీవ్ర నిర్బంధంతో చాలా మంది లొంగిపోయారు. అలాగే అరెస్టులు, ఎన్‌కౌంటర్లతో జిల్లాలో ఆ పార్టీ తీవ్రంగా దెబ్బతింది. ఉమ్మడి జిల్లాకు చెందిన అజ్ఞాత నక్సల్స్‌తో పాటు మిలిటెంట్లు, సానుభూతిపరులు 125 మంది వరకు ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. వందలాది మంది అరెస్టయ్యారు. అలాగే చాలా మంది లొంగిపోయారు.

మావోయిస్ట్‌ పార్టీగా అవతరించాక..

2004లో సీపీఐ(ఎంఎల్‌), పీపుల్స్‌వార్‌ తదితర పార్టీలు విలీనమై మావోయిస్టు పార్టీగా అవతరించింది. కాగా మావోయిస్టు పార్టీగా ఆవిర్భవించిన సమయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన గంగుల వెంకటస్వామి అలియాస్‌ రమేశ్‌ నాయకత్వంలో పార్టీ కార్యకలాపాలు జోరుగానే సాగాయి. ప్రభుత్వంతో చర్చల ప్రక్రియ కొనసాగుతున్నపుడు ఊరూరుకు సాయుధ నక్సల్స్‌ వెళ్లి సభలు, సమావేశాలు నిర్వహించారు. అదే సమయంలో మానాల వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోయారు. దీంతో జిల్లాలో మావోయిస్టు పార్టీ గట్టి దెబ్బ తగిలింది. అనంతర పరిణామాల నేపథ్యంలో జిల్లాకు చెందిన వారిని పార్టీ ఇతర రాష్ట్రాలకు పంపించింది. దీంతో జిల్లాలో ఆ పార్టీ ఉనికి లేకుండాపోయింది.

జనజీవన స్రవంతిలో కలవాలి..

మావోయిస్టు నక్సలైట్‌ ఉద్యమంలో జిల్లాకు చెందిన ఐదుగురు వ్యక్తులు ఉన్నట్లు ఎస్పీ సింధు శర్మ వెల్లడించారు. కొత్తగూడెం భద్రాద్రి, ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రానికి చెందిన ఇద్దరు నక్సలైట్లు శుక్రవారం ఎస్పీ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతలేమితో, ఇతర అనేక కారణాలతో బలహీనపడిందని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో చాలా మంది మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, సానుభూతి పరులు పార్టీని వదిలేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని లొంగిపోయిన మావోయిస్ట్‌ల ద్వారా తెలిసిందన్నారు. జిల్లాకు చెందిన ఐదుగురు వ్యక్తులు అజ్ఞాతంలో ఉన్నారన్నారు. వారు కూడా లొంగిపోతే పునరావాసం కల్పిస్తామని పేర్కొన్నారు. వారు స్వతంత్రంగా జీవించడానికి అన్ని రకాలుగా సాయం చేస్తామన్నారు.

క్లుప్తంగా

నాసిరకం సరుకులు వాడొద్దు



మాక్లూర్‌: విద్యార్థులకు అందించే భోజనంలో నాసిరకం సరుకులు వాడొద్దని సంయుక్త కలెక్టర్‌ అంకిత్‌కుమార్‌ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. కొన్ని గదులు అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు వండిపెడుతున్న సరుకులు నాణ్యంగా ఉండాలన్నారు. విద్యార్థులు గత సంవత్సరం కంటే ఈసారి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఎంపీవో శ్రీనివాస్‌, సిబ్బంది ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌ రూరల్‌: నగరంలోని కలెక్టరేట్‌లో గల డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవోల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గంగు సంతోష్‌ కుమార్‌, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా శ్రీరామ్‌ నారాయణ, ఉపాధ్యక్షులు–1గా నీలావతి, ఉపాధ్యక్షులు–2గా రాములు నాయక్‌, జాయింట్‌ సెక్రెటరీగా వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీగా నాగ్‌నాథ్‌, పబ్లిసిటీ సెక్రెటరీగా సతీష్‌ కుమార్‌, ఎగ్జిక్యూటివ్‌ మెంబర్లుగా బాలకిషన్‌, శంకర్‌, తిరుమల, రాజా శ్రీనివాస్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జెడ్పీ సీఈవో సాయాగౌడ్‌, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదు

ఖలీల్‌వాడి: ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని డీసీపీ(అడ్మిన్‌) బస్వారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్‌ శాఖలో పదవీ విరమణ చేసిన నిజామాబాద్‌ రూరల్‌ ఏఎస్సై యేముల వెంకయ్య, రుద్రూర్‌ పీఎస్‌ హెడ్‌కానిస్టేబుల్‌ కోల విఠల్‌ను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. పోలీస్‌ శాఖలో ఎంతో పనిఒత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవీ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆఫీస్‌ సూపరింటెండెంట్‌ శంకర్‌, స్పెషల్‌ బ్రాంచ్‌ ఏసీపీ శ్రీనివాస్‌రావు, సిబ్బంది సతీష్‌, శ్రీనివాస్‌, తిరుపతి, పాషా తదితరులు ఉన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



లింగంపేట(ఎల్లారెడ్డి): కొర్పోల్‌ గ్రామంలోని హరిహర దేవాలయం వద్ద శుక్రవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టెంకాయ కుస్తీ నుంచి మూడు తులాల వెండి కడెం వరకు కుస్తీ పోటీలు పెట్టారు. పోటీల్లో గెలుపొందిన కుస్తీ వీరులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీలు ఆద్యంతం రసవత్తరంగా సాగాయి. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భాస్కర్‌, కాశీదాస్‌, ఏగొండ, రవి, లక్ష్మణ్‌, రాములు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కొందరికే ‘ఇందిరమ్మ’ సాయం

- మోర్తాడ్‌ మండలం గాండ్లపేట్‌కు చెందిన ధైడి అమ్మాయి, ముద్దం ఎల్లమ్మలకు వ్యవసాయ భూమి లేదు. వీరిద్దరూ వ్యవసాయ పనులతోపాటు ఉపాధి హామీ పథకం కింద పనులు చేసి జీవిస్తున్నారు. భూమి లేని కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం కింద ఏడాదికి రూ.12వేలను రెండు విడతల్లో అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈక్రమంలో అమ్మాయి, ఎల్లమ్మలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి లబ్ధిదారులుగా ఎంపికైనా తొలి విడతలో జమ కావాల్సిన రూ.6వేలు ఖాతాలోకి చేరలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో భరోసా సొమ్ముకు బ్రేక్‌ పడింది. అమ్మాయి, ఎల్లమ్మల మాదిరిగానే చాలా మంది వ్యవసాయ కూలీలు భరోసా డబ్బుల కోసం కొన్నిరోజులు ఓపిక పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- మొదట మండలంలో ఒకే గ్రామానికి ఆత్మీయ భరోసా నిధులు
- ఎన్నికల కోడ్‌తో మిగతా లబ్ధిదారులకు బ్రేక్‌
- కోడ్‌ లేని జిల్లాల్లో అర్హుల ఖాతాల్లో జమ



మోర్తాడ్‌(బాల్కొండ): గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకానికి శ్రీకారం చుట్టింది. మొదటిరోజు జిల్లావ్యాప్తంగా మండలానికో గ్రామాన్ని పథకానికి ఎంపిక చేసింది. అందులో భాగంగా జిల్లాలోని 31 గ్రామాల్లో 1,675 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.కోటీ 50వేలను విడుదల చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి జిల్లా వ్యాప్తంగా మొత్తం 38,802 మందిని అర్హులుగా గుర్తించారు. వీరి కోసం ఒక్కో విడతలో రూ.23,28,12,000 మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 1,675 మందికే ఆత్మీయ భరోసా సొమ్ము జమ చేయగా ఇంకా 37,127 మందికి రూ.22,27,62,000 నిధులను కేటాయించాల్సి ఉంది. కాగా, మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కోడ్‌ అమలు లేని జిల్లాలకు ఆత్మీయ భరోసా నిధులను విడుదల చేయడం గమనార్హం.

కోడ్‌ ఎత్తివేసిన తర్వాతే స్పష్టత..

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ అమలులోకి రాకముందే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో నిధుల విడుదలకు కోడ్‌ అడ్డుకాకపోవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ గురువారం ముగియగా, ఓట్ల లెక్కింపు సోమవారం జరగనుంది. దీంతో ఎన్నికల కోడ్‌ తొలగిపోయేందుకు మరో వారం రోజులు పట్టే అవకాశం ఉంది. కోడ్‌ ఎత్తివేసిన తర్వాతే ఆత్మీయ భరోసా సొమ్ము జమపై స్పష్టత రానుంది. ఈ విషయమై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను 'సాక్షి' వివరణ కోరగా.. ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో ఏం చెప్పలేమని వెల్లడించారు.

ఇంటర్‌ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు
- సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దు
- వీసీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష
- పాల్గొన్న జిల్లా అధికార యంత్రాంగం



వీసీలో పాల్గొన్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఇతర అధికారులు

నిజామాబాద్‌అర్బన్‌: కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఇంటర్మీడియట్‌ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. ఈనెల 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్‌ పరీక్షల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, పోలీస్‌ కమిషనర్లు, ఎస్పీలతో శుక్రవారం సాయంత్రం సీఎస్‌ వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్ష జరిపారు. ఈసందర్భంగా సీఎస్‌ మాట్లాడుతూ.. ఎలాంటి పొరపాట్లకు, కాపీయింగ్‌కు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్షలను నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లను అనుమతించకూడదని, చీఫ్‌ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్‌ అధికారులు, ఇన్విజిలేటర్‌లతోపాటు కేంద్రాలను తనిఖీ చేసేందుకు వెళ్లే అధికారులు సైతం ఫోన్‌లు తీసుకెళ్లకూడదని ఆదేశించారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతనే లోనికి అనుమతించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ అమలు చేస్తూ, గట్టి పోలీస్‌ బందోబస్తును ఏర్పాటు చేయాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌ అనంతరం కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులకు కీలక సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తీసుకురావడం మొదలుకుని, పరీక్షలు ముగిసిన మీదట ఆన్సర్‌ షీట్లను నిర్ణీత పాయింట్‌కు తరలించేవరకు ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. పరీక్షలు ప్రారంభం కావడానికి ముందే కేంద్రాలను సందర్శించి తాగునీటి వసతి, సరిపడా ఫర్నీచర్‌, టాయిలెట్స్‌ వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేవా అన్నది పరిశీలించాలని తహసీల్దార్లకు సూచించారు. పరీక్ష సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్‌కు సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి, వార్షిక పరీక్షలకు సంబంధించి వారికి ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డీఐఈవోను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌, బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో, అదనపు డీసీపీ బస్వారెడ్డి, డీఐఈవో రవికుమార్‌, నగర మున్సిపల్‌ కమిషనర్‌ దిలీప్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు

నిజామాబాద్‌అర్బన్‌: ఇంటర్‌ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని, ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలోనే పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని జిల్లా ఇంటర్‌ విద్యాశాఖ అధికారి రవికుమార్‌ అన్నారు. నగరంలోని ఖిల్లా ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో శుక్రవారం ఆయన ఇంటర్‌ పరీక్షల నిర్వహణపై సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్‌ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చీఫ్‌ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్‌ ఆఫీసర్లు, ఇచ్చితంగా నియమ నిబంధనలను పాటిస్తూ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు. జిల్లాలో 57 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలీస్‌ స్టేషన్‌ నుంచి ప్రశ్నాపత్రాల బండిల్లను పోలీసు బందోబస్తుతో తీసుకు వెళ్లిన తర్వాత పరీక్ష కేంద్రంలో ఇచ్చితంగా సీసీ కెమెరాల ముందు మాత్రమే విప్పాల్సి ఉంటుందన్నారు. పరీక్షలు పూర్తయిన వెంటనే సమీపంలోని పోస్టాఫీస్‌లలో జవాబు పత్రాల బండల్‌లను నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించిన సిబ్బంది, ఉద్యోగులపై ఇంటర్‌ బోర్డు ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఉదయం 8.15 నుంచి విద్యార్థులను అనుమతిస్తారని, 9గంటలకు గేట్‌ మూసివేస్తారని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్‌ విద్యాశాఖ అధికారి రవికుమార్‌

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



నిజామాబాద్‌ సిటీ: నగరంలోని కంఠేశ్వర్‌లోగల మెప్మా కార్యాలయంలో ఆర్పీలకు, డ్వాక్రా సంఘాల సభ్యులకు శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై మున్సిపల్‌ ప్రాజెక్టు అధికారి చిదుర రమేష్‌ అవగాహన కల్పించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సిటీజన్‌ ఫీడ్‌బ్యాక్‌ నమోదుతోపాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మొబైల్‌ యాప్‌లో ప్రశ్నావళిని పూరించే విధానం గురించి వివరించారు. నగరంలోని ప్రతి పౌరుడు ఈ ప్రశ్నావళిని పూర్తిచేయాలని, దీంతో నగరానికి ర్యాంక్‌ ఇవ్వనున్నట్లు తెలిపారు. నగరవాసులు తమకు అందుతున్న సేవలను యాప్‌లో ఫీడ్‌బ్యాక్‌ ఇవ్వాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

EDUCATION

DISTANCE EDUCATION

■SSC / Inter కేవలం 5 పేపర్లతో ఒకే నెలలో పూర్తి చేయవచ్చును. Exams April 2025:BA, BCom, MA, MCom, Bse, Msc, LLB, BTech, MBA, GNM, BAMS, BHMS Dpham, B.pharma NZB Cell 7702669439, 94400 27497.

[SCA25001909]

SERVICES

BUSINESS SERVICE

■మీ బంగారం మణప్పురం, ముత్తూట్‌, మార్వాడీ షాప్స్‌, ఏఇతర ఫైనాన్స్‌లోఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్‌ ధరకు కొనబడును. 9160077916 స్పాట్‌ క్యాష్‌.

[H-783412]

WANTED

■ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్‌ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000/-. ఫోన్‌ : 80084 01243.

[V- 6672]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్‌. జీ: 20K. Ph: 8977639662, 8977639663.

[SCA25001913]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 200/- రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్‌ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్‌

నగరంలో ఒకరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని పూసలగల్లీకి చెందిన బద్దూరి లక్ష్మణ్‌(41) గతేడాది కాలంగా కాళ్లకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. ఎంతకీ వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం

మాక్లూర్‌: మండలంలోని చిక్లీ గ్రామానికి చెందిన వివాహిత కారం సుజాత అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు. గత నెల 15న భర్త కారం నవీన్‌తో ఆమె గొడవ పడి ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఇప్పటికీ ఆమె ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

మాచారెడ్డి: పాల్వంచ మండలంలోని మర్రి వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అనిల్‌ మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకుని సీజ్‌ చేశామన్నారు. ఒక ఇసుక ట్రాక్టర్‌ను కూడా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

అడవుల్లో ఇసుక డంపులు



రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట, మద్దికుంట, సింగరాయపల్లి అటవీ ప్రాంతంలో భారీగా ఇసుక డంపులు కలకలం సృష్టించాయి. ఇసుక డంపులకు సంబంధించిన ఫొటోలు సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారాయి. యథేచ్ఛగా అటవీ ప్రాంతంలో నుంచి అక్రమార్కులు ఇసుక తవ్వకాలు చేస్తున్నా ఫారెస్ట్‌, రెవెన్యూ, పోలీసు అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తీసుకొచ్చేందుకు అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లను నరికి వేసినా అటవీశాఖ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. వెంటనే ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌



హాజరైన మహిళలు

- అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌

నిజామాబాద్‌అర్బన్‌: మహిళలకు ఆర్థిక అక్షరాస్యత ఎంతో అవసరమని అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ సూచించారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా 'పొదుపు చేసే మహిళా సాధిస్తుంది ఘనత' అనే అంశంపై లీడ్‌ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ మహిళలు డబ్బులను పొదుపు చేసుకునేందుకు బడ్జెట్‌ రూపొందించుకోవాలని, అనవసర ఖర్చులను తగ్గించాలని సూచించారు. వ్యాపార లావాదేవీల ద్వారా లాభాలు ఆర్జించడమే కాకుండా, ఆర్థికపరమైన నిర్వహణ అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సురక్షితమైన పొదుపు మార్గాలను ఎంచుకోవాలని హితవుపలికారు. ప్రైవేట్‌ సంస్థలు, వ్యక్తుల నుంచి రుణాలు తీసుకుంటే అధిక వడ్డీలు చెల్లించాల్సి వస్తుందని, దీంతో ఆర్థికంగా నష్టం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న తోడ్పాటును పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించే గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సాయాగౌడ్‌, లీడ్‌ బ్యాంకు మేనేజర్‌ అశోక్‌ చౌహాన్‌ తదితరులు పాల్గొన్నారు.

బురదలో పడి రైతు మృతి



సాయినాథ్‌ మృతదేహం

రుద్రూర్‌: మండలకేంద్రంలో ఓ రైతు పొలం గట్టుపై వెళుతుండగా ప్రమాదవశాత్తు బురదలో పడి మృతిచెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన కాదరి సాయినాథ్‌ (38) అనే రైతు గురువారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. గట్టుపై నడుచుకుంటు వెళుతుండగా అకస్మాత్తుగా బురదలో పడిపోయాడు. వెంటనే స్థానికులు అతడిని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం చికిత్స నిమిత్తం బోధన్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య అర్చన శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫిట్స్‌ రావడంతో కాలువలో పడి ఒకరు..

నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని శ్రీనగర్‌ గ్రామంలో ఓ వ్యక్తికి ఫిట్స్‌ రావడంతో ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి మృతిచెందినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్‌ తెలిపారు. వివరాలు ఇలా.. శ్రీనగర్‌ గ్రామానికి చెందిన చండీ కృష్ణ(37) వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవాడు. రోజువారి మాదిరిగా శుక్రవారం అతడు స్థానిక పంటపొలాలకు వెళ్లగా, ఫిట్స్‌ రావడంతో పక్కనే ఉన్న కాలువలో పడి, మృతిచెందాడు. అతడిని స్థానికులు గమనించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేసవిలోనూ నిరంతర విద్యుత్‌



సుభాష్‌నగర్‌: వేసవిలోనూ నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడమే లక్ష్యంగా ఎన్పీడీసీఎల్‌ పని చేస్తుందని ఎస్‌ఈ రాపల్లి రవీందర్‌ అన్నారు. నగరంలోని డీ–2 సెక్షన్‌ తిలక్‌గార్డెన్‌ సబ్‌స్టేషన్‌లోగల పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను 8.0 ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏగా మార్చి అమర్చారు. ఈసందర్భంగా శుక్రవారం నూతన ఎంవీఏను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తిలక్‌గార్డెన్‌ సబ్‌స్టేషన్‌లో రెండు 8.0 ఎంవీఏ పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని, అందులో ఒక 8.0 ఎంవీఏ పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను రూ.1.50 కోట్లతో 12.5 ఎంవీఏగా మార్చామని తెలిపారు. పట్టణ ప్రజలకు సబ్‌స్టేషన్‌లో అంతరాయం ఏర్పడితే మరో సబ్‌స్టేషన్‌ నుంచి విద్యుత్‌ సరఫరా అందించడానికి 12.5 ఎంవీఏ పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ అమర్చామన్నారు. డీఈ ఎం శ్రీనివాస్‌రావు, డీఈఎంఆర్‌టీ వెంకటరమణ, టౌన్‌–2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి, ఏడీఈలు చంద్రశేఖర్‌, వీరేశం, నటరాజ్‌, తోట రాజశేఖర్‌, ఏఈలు జాకీర్‌అలీ, రాజేందర్‌రెడ్డి, సాయిలు, దుర్గా ప్రసాద్‌ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని కోటగల్లి ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం శాస్త్రము–ఆరోగ్యము అనే అంశంపై జిల్లా వైద్య శాఖ హెల్త్‌ ఎడ్యుకేటర్‌ వెంకటేశ్వర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగాలు దరి చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామచందర్‌ గైక్వాడ్‌, ఉపాధ్యాయులు దయానంద్‌, సౌందర్య, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.